క్లుప్తంగా

టీజీఎంఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజా



రమావత్ రాజాను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మిర్యాలగూడ : తెలంగాణ మీసేవా ఫెడరేషన్ (టీజీఎంఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడిగా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన రమావత్ రాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం సభ్యుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. జిల్లాలో ఆధార్, మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సభ్యులు మోహిత్, బాలరాజు, ముఖేష్, వినోద్, క్రాంతి, వెంకటేశ్వర్లు, రహీం, రమేష్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, అంజి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి శశిధర్‌రెడ్డి

వేములపల్లి : ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియాను సకాలంలో అందించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులు తమ పనులు విడిచిపెట్టి యూరియా కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రొండి శ్రీనివాస్, కోడిరెక్క వెంకన్న, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు రూ.లక్ష ఆర్థికసాయం




కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నిడమనూరు : అనారోగ్యానికి గురైన కార్యకర్తను ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బంటువారిగూడెం గ్రామానికి చెందిన మెరుగు అంజయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం అంజయ్యను పరామర్శించి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. తన సొంత డబ్బుతో శస్త్ర చికిత్స కూడా చేయిస్తానని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, నర్సింగ్ విజయ్‌కుమార్, మొలక శ్రీనివాస్‌రెడ్డి, యువజన నాయకుడు మెరుగు శ్రీను, కారింగుల నరేష్ తదితరులు ఉన్నారు.

గోల్డ్‌మెడల్‌కు ఎంపికైన ప్రణీతకు అభినందనలు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం ఎకనామిక్స్ ఫోరం విద్యార్థిని చందా ప్రణీత 2023–24గాను సామాజిక శాస్త్రం (ఎకనామిక్స్) విభాగంలో గోల్డ్ మెడల్‌కు ఎంపికైనట్లు ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఈ గోల్డ్‌మెడల్ అందుకోనున్నట్లు తెలిపారు. చందా ప్రణీతను అభినందించిన వారిలో త్రిపురం భాస్కర్ రెడ్డి, షేక్ సుల్తానా, పాలడుగు నరేష్, నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నర్సిరెడ్డిలు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామగిరి (నల్లగొండ): మండలంలోని పెద్ద సూరారం గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్, బీపీ పరీక్షల వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ అధ్యక్షుడు తంతనపల్లి సైదులు, వైస్ ప్రెసిడెంట్ యాస వెంకట్‌రెడ్డి, మంచికంటి నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

వ్యాధుల కట్టడికి చర్యలు

- మున్సిపాలిటీలో వారంలో ఒకరోజు డ్రైడే
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

దేవరకొండ : సీజనల్ వ్యాధులు ముసిరే సమయం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ వ్యాధులు మరింత విజృంభిస్తున్నాయి.ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో చేపట్టిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం ఒక రోజు డ్రై డే పాటించాలని మున్సిపల్‌శాఖ నిర్ణయించింది. ప్రస్తుత కాలంలో నీటి తొట్టిలు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, వాడి పారేసిన టైర్లు తదితర వాటిలో వర్షపునీరు నిల్వ ఉండి దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ సమస్యను తక్షణం అధిగమించేందుకు మున్సిపల్ శాఖ ప్రతి ఇంట్లో ఎవరికి వారు స్వతహాగా డ్రై డే పాటించాలని సూచిస్తూ కార్యాచరణను రూపొందించి అమలు చేస్తోంది.

మున్సిపాలిటీలో ఇలా..

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 20 వార్డులు ఉన్నాయి. 48వేల జనాభా ఉంది. కాగా దేవరకొండ పట్టణానికి ప్రతి నిత్యం ఇతర పట్టణాలు, గ్రామాల నుండి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాకుండా వాణిజ్యపరంగా దేవరకొండ అభివృద్ధి చెందుతుంది. ప్రతి నిత్యం పట్టణంలోని వాణిజ్య సముదాయాలు, గృహాల నుంచి దాదాపు 16 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తుండగా రెండు మెట్రిక్ టన్నుల చెత్తను కంపోస్ట్ తయారీకి తరలిస్తుండగా మరికొంత చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం..

ప్రస్తుత తరుణంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వానాకాలంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ కేసులు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువగా మురుగునీటిలో పెరుగుతుంది. మున్సిపాలిటీలల్లో మురుగు నీరంతా మడుగులు కట్టి దోమల విజంభణకు కారణమవుతోంది. వాడి పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, చిప్పల్లో నీరు నిల్వ ఉంటోంది, వీటిలో వర్షపు నీరు నిలిచి డెంగీకి కారణమయ్యే దోమ వృద్ధి చెందుతుంది. ఇది కుట్టిన వెంటనే జ్వరం, కండరాల నొప్పులు, వాంతులు, దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటాయి.

దోమల నివారణ చర్యలు..

ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దోమల నివారణ చర్యలపై ఇప్పటికే సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులతో పాటు ఆయా ప్రాంతాల్లో కాల్వల పూడిక, వ్యర్థాలను తొలగించాలి. మురుగు నీరు నిల్వ ఉన్న గుంతల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల లార్వాను నియంత్రించేందు చర్యలు చేపట్టారు.అలాగే మురుగు కాల్వల్లో మందుల పిచికారీ చేపట్టి ప్రధాన ప్రాంతాలు, కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలుపుతున్నారు.ఇదిలా ఉంటే అవసరమైన ప్రాంతాల్లో వెంటనే ప్రత్యేక వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం తరపున అన్ని రకాల చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో నీటి నిల్వ ఉంటే తొలగించాలి. నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలి. దోమలను నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వారంలో ఒక రోజు డ్రై డేను తప్పకుండా పాటించాలి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు అందించాలి.

– సుదర్శన్, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

చింతపల్లి: కాళికా మహాదేవి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండి, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ఆకాంక్షించారు. ఆదివారం చింతపల్లి మండల పరిధిలోని అంగడి కుర్మపల్లి గ్రామంలో నిర్వహించిన జగజ్జనని కాళికా మహాదేవి ముఖద్వారం శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అలివేలు సంజీవ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరి నాయక్, కుర్మేడు మాజీ సర్పంచ్ రాటకొండ రుద్రమదేవి నరేంద్ర ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ ముంజంపల్లి విద్యాధర్, అంగిరేకుల గోవర్ధన్, తమ్మిడి రవి శంకర్ రెడ్డి, ఈరటి మల్లేష్ యాదవ్, కట్ట మహేష్, కట్ట శ్రీకాంత్, చెవిటి సైదులు, మహేష్, ఆంజనేయులు, అందోజు సత్యం, దార్ల జంగయ్య,ఆదిమూలం మహేష్ పాల్గొన్నారు.



కురంపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలు నాయక్

కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న శాసనమండలి చైర్మన్

దేవరకొండ : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం నిర్వహించారు. రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా స్వర్ణ రథం ప్రారంభోత్సవం సందర్భంగా వేద పడింతులు వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రెండో రోజులు పాటు జరుగనున్న ప్రత్యేక పూజల్లో ఆదివారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణరథ కమిటీ ఆధ్వర్యంలో అద్భుత శిల్పకళా నైపుణ్యంతో రథం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పానుగంటి మల్లయ్య, వనపర్తి మురళి, వాసా వెంకటేశ్వర్లు, రాచమమళ్ల వెంకటేశ్వర్లు, చీదెళ్ల వెంకటేశ్వర్లు, సముద్రాల ప్రభాకర్, కొత్త సుబ్బారావు, ఆలంపల్లి నర్సింహ, నీల సంజీవ్, దొడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు బీసీలు కదిలిరావాలి



మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టబోయే సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం మిర్యాలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలపై ఒక్కసారిగా ఎనలేని ప్రేమ చూపిస్తున్నాయని, గత ఎన్నికల్లో ఇవే పార్టీలు బీసీలను చిన్నచూపు చూశాయని ఆరోపించారు. బీసీలపై అన్ని రాజకీయ పార్టీలకు ప్రేమ ఉంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించాలని, లేదా అన్ని రాజకీయ పార్టీలు కలిసి బీసీని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కావాలని గత 50 ఏళ్లుగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్యాగ్రహ దీక్షకు ప్రతి ఇంటి నుంచి ఒక బీసీ కదిలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు చిలకల మురళీయాదవ్, గంగాధర్, రాయంచు నర్సింహ, నరేష్, సతీష్, వెంకట్ తదితరులు ఉన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

దేవరకొండ : హైదరాబాద్‌లోని గాజులరామారంలో ఈనెల 20 నుంచి నిర్వహించనున్న భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎల్ 1, ఎల్2, ఎల్3 లిస్టులతో సంబంధం లేకుండా అధికారులు నిజమైన అర్హులను గుర్తించి ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అర్హులను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. పోలె వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, తూం బుచ్చిరెడ్డి, దేప సుదర్శన్ రెడ్డి, మైనొద్దీన్, అచ్చయ్య, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు పాల్గొన్నారు.

చిన్నవాగు వెంట రక్షణ గోడ నిర్మించాలి



పెద్దవూరలోని ఎస్సీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న లక్ష్మీనారాయణ

పెద్దవూర : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చిన్నవాగు వెంట రక్షణ గోడ(సైడ్ వాల్) నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ కాలనీలో 80 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. వర్షాకాలంలో చిన్నవాగు పొంగి ఇళ్లలోకి వరద నీరు చేరుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీ మురుగు కాలువలు నిర్మించాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, నాయకులు ఎస్‌కే బషీర్, దోరెపల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



లాంచీల కోసం వేచి ఉన్న పర్యాటకులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. విద్యాసంస్థలకు మూడురోజులుగా సెలవులు రావడం, సాగర్ గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరవళ్లతోపాటు పరిసర ప్రాంతాలను తిలకించేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. పర్యాటకులు లాంచీలలో నాగార్జునకొండకు వెళ్లడానికి పోటీపడ్డారు. టికెట్లు దొరకని పర్యాటకులు సాయంత్రం జాలీ ట్రిప్పులతో సంతృప్తి పడ్డారు. చిరు వ్యాపారులు తయారు చేసే చేపల వేపుళ్లకు మస్త్ గిరాకీ ఉంది.



తీరానికి చేరిన లాంచీ

ప్రజాపాలనలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

నిడమనూరు : కాంగ్రెస్ ప్రజాపాలనలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిడమనూరులో ఇందిరమ్మ ఇంటి పనులకు భూమి పూజచేసి, మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

నిడమనూరు చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే..

వర్షాలకు నిడమనూరు చెరువు ప్రమాదకర స్థాయిలో అలుగు పోస్తుండడంతో ఎమ్మెల్యే ద్విచక్రవాహనంపై వెళ్లి చెరువుకట్టను, బతుకమ్మ ఘాట్‌ను, బంకాపురం రోడ్డులోని లోలెవెల్ కల్వర్టును పరిశీలించారు. అనంతరం నిడమనూరు మండల పరిషత్ కాంప్లెక్స్‌లోకి మార్చుతున్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, మాజీ జెడ్పీటీసీ మేరెడ్డి పుష్పలత, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, మోసాల శ్రీను, శేషరాజు శ్రీను, మెరుగు మధు, కుంచెం సతీష్, పుల్లయ్య, తుకారం, పగిళ్ల శివ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే విద్యుత్ సమస్యల పరిష్కారం

నిడమనూరు : కాంగ్రెస్‌తోనే విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యాయని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వేంపాడులో రూ.2.94 కోట్లతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను, 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పూజలు చేసి ప్రారంభించారు. సబ్‌స్టేషన్ యార్డు, ఫీడర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగార్జున్ సాగర్ నియోజకవర్గంలో 34 సబ్‌స్టేషన్లు ఉండగా, 32 సబ్‌స్టేషన్ల నిర్మాణం జానారెడ్డి హయాంలోనే జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, రాష్ట్ర నాయకులు ఎడవెల్లి వల్లభారెడ్డి, మేరెడ్డి కృష్ణవివేక్, బైరెడ్డి స్ఫూర్తిరెడ్డి, నర్సింగ్ విజయ్‌కుమార్, నందికొండ మట్టారెడ్డి, విద్యుత్ డీఈ శ్రీనివాస్‌చారి, సబ్ డివిజనల్ ఏడీఈ నాగేశ్వర్‌రావు, తిరుపతయ్య, దీప్తి, నిడమనూరు ఏఈ శరత్‌కుమార్, సివిల్ ఏఈ శంకర్, కన్‌స్ట్రక్షన్ ఏఈ కల్పన, ఎస్ఎల్ఎం మారం శ్రీను, సబ్ ఇంజనీర్ వెంకట్‌రెడ్డి, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



నిడమనూరు : ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి.



వేంపాడు సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

సాయిబాబా ఆలయంలో శివలింగం ప్రతిష్ఠ

నాగార్జునసాగర్ : సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పైలాన్‌కాలనీలోని సాయిబాబా ఆలయంలో గత మూడు రోజులుగా నవచండీ సహిత మహారుద్రయాగం, మరకత శివలింగ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి రుద్ర యాగ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం మహారుద్ర జపం, అఘోరాస్త్రహవచనం, చండీపారాయణం, ప్రదోషపూజ, రాజోపచారసేవ, చతుర్వేదస్వస్తి, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎట్టకేలకు బీసీకాలనీకి మార్గం సుగమం



రోడ్డును ప్రారంభిస్తున్న మాజీ ఎంపీటీసీ, సర్పంచ్

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని జైత్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీకి ఎట్టకేలకు మార్గం సగమమైంది. మాజీ ప్రజాప్రనిధుల సహకారంతో సుమారు రూ.20 లక్షలతో భూమిని కొనుగోలు చేసి బీసీ కాలనీకి దారి సౌకర్యం కల్పించారు. ఆదివారం ఆ రోడ్డును మాజీ సర్పంచ్ పాశం నరసింహారెడ్డి, ఎంపీటీసీ పాశం హైమావతి ప్రారంభించారు. అయితే బీసీ కాలనీకి ఇన్నాళ్లు దారి లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో దారి ఉన్నప్పటికీ స్థానిక రాజకీయ కక్షల కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కాలనీలో నివసిస్తున్న సుమారు 30 కుటుంబాలు సాగర్ ఎడమకాలువ కట్ట పైన వాహనాలు నిలిపి పొలాల నుంచి కాలనీకి వెళ్లేవారు. విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు తిప్పలు తప్పలేదు. చివరకు దారి కోసం రైతు భూమిని ఇచ్చేందుకు ముందుకు రావడంతో రూ.17లక్షలకు కొనుగోలు చేసి రహదారిని ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్, ఎంపీటీలు దారి కోసం రూ.10 లక్షలు అందించారు. దారి కోసం సాయం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈశ్వర్, మాజీ సర్పంచ్‌లు సుజాత, రమణ, భిక్షంగౌడ్, గంగాధర్, నాగయ్య, రవీందర్‌రెడ్డి, గార్లపాటి సుధాకర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీను, నక్క వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి పొందాలి

గుర్రంపోడు : మండలంలో గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు పొందాలని ఎస్ఐ పసుపులేటి మధు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు ఎటువంటి అనుమతి లేదని అన్నారు. అలాగే నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

ఘనంగా తీజ్ వేడుకలు

డిండి: గిరిజన సాంప్రదాయానికి ప్రతీకగా జరుపుకునే తీజ్ వేడుకలు మండల కేంద్రంలో ఆదివారం గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక తుల్జా భవాని ఆలయం వద్ద 9రోజుల పాటు పూజలు నిర్వహించిన మొలక బుట్టలను ఎత్తుకున్న గిరిజన మహిళలు డిండి ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని హైద్రాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే రోడ్డు మార్గంలో రాక పోకలు కొనసాగించిన ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఎస్ఐ.బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రవి, రాములు, లక్ష్మీపతి, బలరాం, రాజు, సతీష్, భాస్కర్, పాండు, కృష్ణ, జైపాల్, పర్వతాలు, గోపాల్, లక్ష్మీ, బుజ్జి, పద్మ, రాణీ, చిట్టి పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి

డిండి: కందుకూర్ గ్రామానికి చెందిన వానం నరేందర్‌రెడ్డిని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. తన ఎన్నికకు సహరించిన వారందరికీ నరేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



ముత్యాలమ్మ ఆలయం వద్ద పోతురాజుకు పూజలు చేస్తున్న మహిళలు



ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : శ్రావణ మాసం ఆఖరి ఆదివారం పురస్కరించుకొని మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో గల కనకదుర్గమ్మ ఆలయం ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. పట్టణ పరిధిలోని మహిళలు బోనాలను తలపై ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య కుటుంబసభ్యులతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి నేవేద్యం, చీర, సారెలు సమర్పించారు. భక్తులు పోతురాజుకు కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని పూజలు జరిపారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కోల సైదులు, మున్సిపల్ మాజీ చైర్మన్ మెరుగు రోశయ్య, మాజీ వైస్ చైర్మన్ బంటు సైదులు, బంటు శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, కోల శ్రీనివాస్, మురళి, కొంక వెంకన్న, బంటు రమేష్, కోల రవి, కోల రామస్వామి, ఈదయ్య, విజయ, పద్మ, కొంక శ్రీనివాస్, కోల వెంకన్న, బంటు కృష్ణ, పఠాని సైదులు, లక్ష్మణ్, శరత్, నక్క శేఖర్, కోల రాంబాబు ఉన్నారు.

సోమవారిగూడెంలో..

మండలంలోని సోమవారిగూడెంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామంలో వనవాసం కార్యక్రమం కూడా నిర్వహించారు. పూజల అనంతరం బంధుమిత్రులతో కలిసి చెట్లకిందకు వెళ్లి భోజనాలు చేశారు. వేడుకల్లో చెర్క శ్రీను, పెద్దగొల్ల సింగం చంద్రయ్య, పల్లబోయిన రామలింగయ్య, నూనె సైదులు, గుండెబోయిన రాము, జంపాల శంకరయ్య, చెవగోని అంజయ్య, సుంకి బసప్ప, శింగం నాగయ్య, బర్పటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: చింతపల్లి మండలంలో కేంద్రంలో ఆదివారం ఆషాఢమాస బోనాల వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గ్రామ దేవతలకు మహిళలు నీళ్లు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యువతులు, మహిళలు గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరారు. మేళ తాళాలు, డప్పు నృత్యాలు మధ్య మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో గ్రామంలో తిరిగి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. బోనాల వేడుకల్లో దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోనాల వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



చింతపల్లిలో బోనాలతో వస్తున్న మహిళలు